ఊహా ఊర్వశి

[కథ]

= శ్రీ చాగంటి సోమయాజులు =

వెళ్లేను పెళ్లికి వాళ్లందరితోటీ. పడవనిండా కిక్కిరిసి కూర్చున్నాము. పదిహేను ళ్లు గోదావరిలో ప్రయాణం. ఎక్కింది వాకపడవ. పొంగుతూ తోసుకొచ్చింది సముద్రపుపోటు. తాటిచెట్టంత కెరటాల నెత్తి తిరగేస్తూ లేచింది గాలి. తెరచాపలు రెండూ బిగిసి పూరిస్తే కొయ్యలు కీచులు పెట్టాయి. ఎత్తి కుదేస్తూ ఇనపనాగలిలాగ పడవ నీళ్లని దున్నుతున్నాది.

పడవహోరెగరగొడుతూ పెళ్లివారు గొడవచేస్తున్నారు. వినవలసిన విషయాలే. మామ్మూలు మానవుల మురికిజీవితం అంతా వాళ్ల సంభాషణలో విమర్శ కొస్తోంది. ంకులు, రోగాలు, కుతంత్రాలు, కృత్రిమాలు, పెళ్లిళ్లు, పురుళ్లు, అప్పాస్తులు-సర్వం వాళ్ల పిచ్చాపాటీకి కీలకం అవుతున్నాది. జీవితాన్ని సారస్వతంలోకి ఎక్కించి విమర్శించదలుచుకొన్న సాహిత్యపరులకి అదంతా చాలా ఖరీదైన ముడిపదార్థం.

పదహారేళ్ల నాపెళ్లాం వాళ్ల మధ్య పెద్దపేరక్కలా పేలాపనలోకి దిగింది. పదహారేళ్లదైతే యేం? ఇద్దరు పిల్లల్ని కని, అబ్బో, అమ్మ అయిపోయింది. అమ్మలక్కలతో సరిగ్గా మాట్లాడుతోంది.

ప్రసాదరావుపెళ్లి. ఆఖరి కెలాగైతేనేం- అవుతోంది. అదృష్టవంతుడు. రెండువేల కట్నం డావుకొట్టున్నాడు. పద్దెనిమిదేళ్ల పిల్లని పెళ్లాడుతున్నాడు. పుస్తె ముడేస్తే చాలు రెక్కట్టుకొని అదే గదిలోకి లాక్కెడుతుంది.

పెళ్లిప్రయాణంలో, పుచ్చపువ్వులాంటి వెన్నెట్లో, నిండుగోదావరిమీద హెత్తారీ లేకపోయింది. పడవలో కళ్లని కదుపుతూ ఒక్క పడుచుపిల్ల ఉంటే పడవలాగే మనస్సూ ప్రయాణం చేసును, గుండెలు పాడుకున్ను. ఆడాళ్ల జనాభా ఎక్కువగానే ఉన్నాది. కాని అందమైంది లేకపోతే అట్టేపోమె పడుచుపిల్లకి కరవైపోయింది. అందికే యీ డంప్సు (dumps).

లగ్నసమయం. శుభ్రమైన పెళ్లికొడుకు. ఎమ్మే చదివేస్తున్నాడు. పెళ్లికూతురు గుజ్జంలాంటి కొండముచ్చు. వొంటినిండా నగలు, జరీచీర, తలనిండా పువ్వులు ధరించింది. అంచేత ఆమె నిడదవోలుస్టేషన్లో మనం చూచే సూచీముఖం కాదు. సర్కసు ఎరీనాలోకి అలంకరించి తీసుకొచ్చే ఆడకోతి.

మూడు ముళ్లూ పడ్డాయి. తలంబ్రాలు పోసుకొన్నారు. పెద్దాళ్లకి కన్నుల వైభవంగా ఉన్నాది కల్యాణం.

నా కేం వెర్రా? ఎందుకొచ్చే నీపెళ్లికి? ఈమనుష్యుల మధ్యకి? మొగాళ్లంతా గాడిదలు; విజ్ఞానదరిద్రులు. ఆడాళ్లంతా పందులు. వాళ్ల మొహాలు పిడతలు. మొగాళ్లంతా తండ్రులు (పితృదేవో భవ); ఆడాళ్లంతా తల్లులు (మాతృదేవో భవ)! ఆడాళ్ల చంకల్లోనూ, మొగాళ్ల తొడలమీదా, పందిరి రాటల కెగబాకురుతూ పిలపిల్లాడుతున్నారు పిల్లలు.

మంగళహారతిపళ్లెం పట్టుకొని నలుగు రమ్మాయిలు పాట ప్రారంభించారు. భ్రాంతి అనుకొన్నానుకాని సరిగ్గా చూస్తే సత్యమే. అందులో చిట్టి ఉన్నాది.

చిట్టి పంధొమ్మిదేళ్లది. నాపెళ్లాంకన్నా మూడేళ్లు పెద్ద. నాపెళ్లాం పిల్లలతల్లి. చిట్టింకా అవివాహిత. పదివేలమంది పడుచులను చూస్తాము. అంతా సముద్రపు ఇసకలో అడుగుల్లాగ మనస్సులోంచి మాయమైపోతారు. చిట్టిరూపం చూచామంటే చెరక్కుండా మనస్సులో శాశ్వతంగా నిలిచిపోతుంది. "ఎందెందు" వెతకిచూస్తే "అందందు" దేముడు కనబడతాడు. కాని 'అందం' ఒక్క చిట్టిలోనే కనబడుతుంది.

ఒక్కొక్క స్త్రీ మనస్సులో బాగా ముద్రపడిపోతుంది. పదేపదే జ్ఞాపకానికొస్తుంది. ఒక్కొక్క స్త్రీ ఒక్కొక్క రసాన్ని హృదయంలో ద్రవింపచేస్తుంది.

మాలక్షుమ్మ జ్ఞాపకానికొస్తే కరుణతో కళ్లు నానిపోతాయి. అంబాయమ్మ జ్ఞాపకానికొస్తే వొళ్లు గంగవెర్రు లెత్తుతుంది. ఆవిణ్ణి గుమ్మంలోంచి 'ఛీఛీఫో' అనాలి. వాళ్ల లచ్చి జ్ఞాపకానికొస్తే ఇంతనా బొద్దుని గుండెకాయ కసాయివాడి దైపోతుంది. లచ్చిని కొరతవెయ్యాలి. లేకపోతే పంజాబుపతాలానికి 'బాల్' చెయ్యాలి. చిట్టి జ్ఞాపకానికొస్తే? సింహాసనం వేసి కూర్చోపెట్టి ఆరాధన చెయ్యడానికి మనస్సు ఆయత్త మాతుంది! అందుకు కావలసిన పూజాద్రవ్యాలు అమర్చుకొంటుంది!

"ఏం చిట్టీ" అని పలకరించా[illegible] ఎంతో తహతహలాడి అవకాశం చిక్కిం[illegible] కొన్నాను.

"రాత్రి నిన్ను చూశాను." అన్నాది చిట్టి.

"ఐతే పలకరించావు కావు!"

"ఎక్కడో మొగాళ్లమధ్య నున్నావు. ఉంటావా?"

"మధ్యాన్నం పోవాలి"

"మావూరు రా."

"తప్పకుండా."

అంతటితో సంభాషణ అంత మైపోయింది. చిట్టిని నేనూ ఆకర్షించాను. అదిమాత్రం ఖాయం. కనబడ్డప్పుడల్లా ఎగాదిగా చూడందీ వదిలిపెట్టదు. చిట్టి నామనస్సుని దెయ్యంలా పట్టుకొంది. ఒంటరిగా పడకకుర్చీలో కూర్చుంటే, ఎదురుగా నవ్వుతూ నిలబడుతుంది. కాఫీ తాగుతూఉంటే పీల్చుపీల్చుకీ దాని అధరం మీద కళ్లు వాల్తాయి. నిద్రలో కల కాదు. జాగ్రదవస్థలో ఉండగా చిట్టిలీల - నిజమైన

చిట్టిలాగే వెచ్చగా, బరువుగా మీదికొస్తుంది.

చిట్టితండ్రి కృష్ణారావు ప్లీడరు. రోజు కూలి పావలా అయినా తెస్తున్నాడో లేదో. పెళ్లంటే మాటలా! కట్నాలు పొయ్యాలి. ఈజన్మ కతగాడు పెళ్లి చెయ్యలేడు. చిట్టికి పంధొమ్మిదోయేడు! నాకు పెద్ద ఆశ పట్టుకున్నాది. చెరువులో తామరలా ఆశ బుర్రంతా చుట్టుకుంది. నాఆశకల్లా హేతువు నాపెళ్లాం మళ్లా కడుపుతోటుంది.

ఆడదానికి ప్రసవమంటే పెద్ద గండం. తల్లీ పిల్లా ఏర్పాటుఅయీవరకూ ప్రాణాలు పిడికిట్లో పట్టుకోవలసిందే. ఈమాటు ప్రసవంతో నాపెళ్లాం విధిగా చచ్చిపోతుందని నిశ్చయించుకొన్నాను. పెళ్లాం చావు కోరడం చాలా జాలికరమైన విషయం. ఆమెతో తృప్తి పొందకపోతే పైతిరుగుళ్లు తిరగొచ్చు. తిరిగినా నాపెళ్లాం ప్రతిఘటించదు. అందవికారి అయిన పెళ్లానికి ఆరోగ్యం, అడకువ, మొగుడంటే వెర్రివ్యామోహం, ఏవంక పెట్టి తిడదామన్నా అవకాశ మివ్వని ప్రవర్తనా ఉంటే ఎలాగ చావడం? దాని చావు కోరడం ఘోరాతిఘోరం. కాని నా చిటికిన వేలుకింద పెళ్లాల రేఖలు రెండున్నాయి. ద్వితీయం ఎలాగూ తప్పదు. పెళ్లాం చచ్చిపోడం, చిట్టిని పెళ్లాడ్డం ఖాయం.

“రెండోపెళ్లి వాడి కిస్తారా” అని సందేహించడానికి నావిషయంలో భయం లేదు. చిన్నప్పుడే పెళ్లయింది కాబట్టి పిల్లలు కలిగారు. పట్టున పాతికేళ్లు లేవు. నాపెళ్లాం కన్నా చిట్టే మూడేళ్లు పెద్ద! నేను కట్నం అడుగుతానేమో అని వాళ్లే భయపడాలి. “రెండోపెళ్లికి కట్నాలుకూడా ఎక్కడ” అండానికి నావిషయంలో వీల్లేదు. నేను తండ్రికొక్క కొడుకుని. నాలుగు డబ్బు లున్నవాణ్ణి. నాలుగు డబ్బులు తెస్తున్నవాణ్ణి. ఇలాగ పెళ్లాం చచ్చిపోతే అలాగ చిట్టితో పెళ్లి అయిపోతుంది.

ఈమాటు నావివాహం ఆదర్శప్రాయంగా జరగాలి. నాచిత్తసంస్కారం ఊరికే పోకూడదు. పూర్వం పెళ్లి ఐదురోజులు. పెళ్లివారి ప్రాణాలు తీస్తూ పీకలమీద కూర్చునేవారు. ఇప్పుడు పెళ్లంటే వోరాత్రి. మర్నాడంతా మర్యాదగా వెళ్లిపోవలసిందే. ఏకరాత్రివివాహం సంస్కరణరీత్యా ముందడుగే.

నాసంస్కరణ మరీ విపరీతం. పెళ్లంటే ఇద్దరు వ్యక్తుల వ్యవహారం. ఇద్దరు సాక్షులూ, రిజిష్టారు అవసరం. ఆజ్యహోమాలు, పురోహితసంభావనలు, డిన్నరుపార్టీలు, అన్నశాంతులూ పనికిరావు. కాణీ కట్నం పుచ్చుకోను. పెళ్లానికి పసుపూ, కుంకం పెట్టక్కర్లేదు. పెళ్లిసంతకాలు కాగానే చకోరదంపతుల మైపోతాము. వెన్నెల్లో కెగిరిపోతాము.

మాయిల్లంతా పాడుపాడుగా ఉన్నాది. ముందు డాబామీద మేడ వెయ్యాలి. స్ప్రింగు మంచం కొని పట్టుపరుపు కుట్టించాలి. బెంగుళూరు వేసంగి కెళ్లి రెండు కుక్కలిని తేవాలి. ఇదంతా చిట్టి పెళ్లామైతే మాట. లేకపోతే ఏముంది? చిలకలు చెక్కిన మా తాతయ్యపందిరిమంచం, అట్టలుకట్టిన మా నాన్నపరుపు, ఉచ్చకంపుకొడుతూ నాపెళ్లాం నులకకుక్కి కలిస్తే నాపడగ్గది! చెప్పే

దేమిటి ? అవన్నీ నాపెళ్లాంతో మాయమైపోయి చిట్టితో నాయిల్లు ఒక మొగలాయి మహా లైపోవాలి.

హయ్యా కాకినా డెళ్లేను ! చిట్టి పిలిచిందని, నాపెళ్లాం ఎలాగా చచ్చిపోతుందని పెళ్లికూతురుచూపుల కెళ్లేను ! రామారావుపేటలో కృష్ణారావుగారింటి కెళ్లేను.

"ఏం వోయ్ జ్ఞాపక మున్నాం ? ప్రసాదంపెళ్లిలో కాబోలు చూశాం. కూర్చో. మరేమిటయ్యా మీవూరి విశేషాలూ ? మీరాజుగారి పిల్ల లెక్కడునారు ?" అంటూ కృష్ణారావుగా రడిగారు.

"అక్కడే ఉన్నారండి."

"ఎప్పుడేనా కనబడతారా ?"

"అప్పటప్పట,"

"మనం కోట్లో కెళ్లొచ్చా ?"

"ఖిలేదారుగారి నడిగి."

"రావాలోయ్ విజయనగరం. మీ మహారాజకుమార్ కూడా ఘట్టివాడే. యీ మధ్య ఆయనస్టేటుమెంట్లు చెడ్డఘాటుగా ఉంటున్నాయి."

ప్లీడరుగారు విశాఖపట్నం హార్బరు మీదా, వాల్తేరువిశ్వవిద్యాలయంమీదా అరగంట హస్కు కొట్టేరు. ఇంతట్లో ప్లీడరుగారి పెళ్లాం, చిట్టీ నీళ్లబిందెల్తో కొళాయి కెళుతూ కనబడ్డారు. చిట్టిని చూడ్డం అయింది; ప్లీడరుగారి పెళ్లాం కుశలప్రశ్న వేసింది :

"ఏం వోయ్. ఎక్కణ్ణుంచేవిఁటి ? పురుటొద్దులుకాబోలు- నీపెళ్లాం అటూ ఇటూ తేలిగ్గా తిరుగుతున్నాదా ?"

"కులాసాగానే ఉన్నాదండి."

"ఇక్కడా, పుట్టింటా ?"

"మా యింటే."

"సరిసరి. అన్నట్టు మాడోపురుడు దూ... భోయనాని కుండేం." అన్నాది. ఆమాట ప్లీడరుగా రనలేకపోయారు.

"ఉంటాను లెండి"

"వొస్తూ పోతూ ఉంటేనే చుట్టరికం. ఏవండీ విశాఖపట్నంవాళ్ల మాట ఇతనితో చెప్పేరూ ?" అని మొగుణ్ణడిగింది.

"ఔనేవ్ మరిచిపోయాను !" అన్నాడతను.

"సరిసరీ ! అలాగే ఉంటుంది మన వ్యవహారం. ఇంకెప్పుడు చేస్తారండీ పెళ్లి ? కన్యాదానమంటే గోదానమా ? ఇద్దరు పిల్లలు పుట్టేకా, వోచెంప నెరిసేకా ?"

"చిట్టికేనా పెళ్లి ?" అనడిగేను.

"ఇంకెవరికోయ్ ?"

"తొందరేవిఁటి లెండి ?"

"తొందర కాకేమిటోయ్?"

"అంత తొందరైతే నాకు చేసీయండి"

"ఛా" అన్నాది చిట్టి.

"నాకన్నా మంచివాడు దొరుకుతాడా?"

"అలాగే అయితే అడిగేవ్! అబ్బో! నీపెళ్లాం జుట్టట్టుకుంటుంది." అన్నా దావిడ.

"పిల్లా న్నొదిలేస్తాను."

"సరిసరి! ఆమూడ్డోపిల్లో, పిల్లాడో పుట్టనీ తాపీగా వొదిలేద్దువుగాని. నాయ న్నాయన! దేముడిలా గొచ్చావు. ఆసంబం ధంగురించి కనుక్కొని భోగట్టా రాసిపెట్టు" అంటూ వీధిలోకి తోవతీసింది. తల్లి మాట్లాడుతూ ఉంటే పక్కగా చిట్టి చక్కగా నిలబడ్డాది. చిన్న మాట కలిపింది. నా కోరిక సిద్ధించింది. చిట్టిని నేనూ, నన్ను చిట్టీ తనివి తీరా చూచుకొన్నాము. చిట్టి నీళ్ల కెళ్లడం నామర్దాగా కనబడ్డా ఆమెచంకలో రాజమండ్రి రేకుబిందె అందంగానే అమిరింది.

భోజన మైంది. కృష్ణారావుగారు విశాఖ పట్నం పెళ్లివారి ఎడ్రెసు ఇచ్చి వాళ్ల స్థితిగ తులు కనుక్కొని రాయమన్నారు. మంచి ఉద్యోగమే. సావిట్లో ప్లీడరుగారి టేబిలు మీద 'జానోలండన్' పత్రిక కనబడ్డాది.

"ఇదెక్కడిది?" అనడిగాను.

"ఇంకోప్లీడరుగారిది. ఇదేకాదు క్రైటీ రియన్, మెర్క్యూరీ, దిబ్బా దిరుగుండం తెప్పి స్తాడు. ఏంటో అత నిలాంటి పత్రికలన్నిం టికీ డబ్బు తగలేస్తాడు. శుద్ధ రేకు" అన్నాడు కృష్ణారావుగారు!

'జానోలండన్' వగైరాలు తెప్పిస్తున్న వాడు శుద్ధ రేకు! ఆసంచిక పేజీలు తిరగేస్తే నేటి సారస్వతంమీద ఒక సనాతనుడి విమర్శ కనబడ్డాది. ఒక్కపేరా చదువుకోలేక పోయాను. అవతలగదిలో చిట్టి తిరుగాడు తున్నాది. అంత దగ్గరలో ఉన్న చిట్టికీ, నాకూ ఎంత ఎడమైనా ఉన్నాది. దాని వెనకాలే తిరిగే భాగ్యం ఉంటే? చిట్టి చిన్న ఘోషా పాటిస్తున్నాది. అంచేత వాళ్ల సావిట్లో కూర్చోడం ముళ్లమీద కూర్చు న్నట్టు ఉన్నాది.

"వస్తాను" అని లేచాను.

"బాబ్బాబు! ఉత్తరం రాయి. కట్నా లంటే నావల్ల కాదు. లాంఛనాల్లో లోపం చెయ్యను. వొచ్చిన వాళ్ల కింత అన్నం పెడ తాను. ఇంత అన్నం ఉంటే ముడెట్టేస్తాను" అన్నాడు.

"కనుక్కొంటాను" అని బయలుదేరాను.

విశాఖపట్నం వెళ్లి చిట్టికి సంబంధం కుదురుస్తానా? వెళుతూనే ఉత్తరం రా శాను- వాళ్ల కప్పుడే బరంపురంపిల్ల నిశ్చయ మైపోయిం దని. భయం పట్టుకొంది. నాకు తెలియకండా చటుక్కుని చిట్టికి పెళ్లయిపో తుంది. కాని ఎంత దుస్సాధ్యమైనా సాధ్యం గానే కనబడుతుంది. చిట్టికి పెళ్లే అయితే దాని మొగుడు తారని చస్తాడు. అప్పుడు విధ వని పెళ్లాడి సధవని చేస్తాను. చిట్టి విధవ అయి తేనే మంచిది. నేను ప్రాథేయపడుతూ పెళ్లాడితే నామీద స్వారీ చెయ్యొచ్చు. విధవ అయితే దీనురా లైపోతుంది. దీనురాలిని పెళ్లాడినవాడు దేముడైపోతాడు.

ఒకనా డర్ధరాత్రి నన్ను మావాళ్లు లేపి మంత్రసాన్ని తీసుకురమ్మన్నారు. చీక ట్లోపడి దేముడా అని వెళ్లేను. మంత్రసాని రాకండానే నాపెళ్లానికి పురుడొచ్చింది. ఆడ పిల్ల పుట్టింది. ఇహ న్నేను జాగ్రత్తపడక పోతే పెళ్లాం ఏటేటా తేలిగ్గా కని ఇల్లు నింపేస్తుంది. పురుడు దానికి గండం కాదు

కాని చిట్టిదెయ్యం నన్ను వొదిలిపెట్టలేదు. కోర్కెలు అణచివేస్తే మనోవికారాలకింద తేలుతాయి. కోర్కెలు సాఫల్యం చెయ్యడమో, లేక జయించడమో మనం చేస్తూ ఉండాలి. చిట్టితో కాపురం చెయ్యకపోతే ఇంకేం జన్మ? ఆకోర్కెతో నేను కుంగిపోవలసిందేనా? లేదు లేదు. వాంఛానివృత్తికి మార్గా లున్నాయి. లేని ఊర్వశితో కాపురం చెయ్యడాని కవకాశా లున్నాయి.

పడకకుర్చీలో మధ్యాహ్నం కునుకు. సగంనిద్రలో తలగడామెత్తదనం ఊర్వశి చెక్కిళ్ల దనుకో. ఊర్వశి సాక్షాత్కార మౌతుంది.

మెత్తటి పరుపుమీద పడుకుని పల్చటి కందువా ముసుగు వెయ్యి. ఊహించు. ఊర్వశి నీపక్కలో ఉంటుంది.

ఏటొడ్డుకి పోయి ఇసకతి న్నెక్కి కూర్చో. భావగీత మోటి నీ కభిమానమైనది కూనిరాగం తియ్యి. భావప్రపంచంలో కెళ్లి మనస్సుని ఊర్వశివైపు మళ్లించు. నీ క్కావలసిన సన్నివేశాలు సంప్రాప్త మౌతాయి.

నీపక్కలో పెళ్లా మున్నాదా, సదవకాశం ఉన్నాది. పెళ్లాన్ని ప్రతిరాత్రీ ఊర్వశి అనుకో. చీకట్లో కళ్లకి కాదండానికి హక్కుపోతుంది. మనస్సుతో చూడు. మసిబొగ్గు మాణిక్య మైపోతుంది.

నిజంగా ఊర్వశిని తెచ్చి నీ కప్పజెపితే నువ్వు చాలా చిక్కుల్లో పడిపోతావు. సంసారికి ఊర్వశి దరిద్రదేవత, దుఃఖకారణమూ అవుతుంది. ఊహాఊర్వశి రాజయోగాన్ని సిద్ధింపిస్తుంది. ఊహాఊర్వశిని పట్టుకొని 'చింబరోజో' అగ్నిపర్వత శిఖరాంచలాలకి షికార్లు పోవొచ్చు. ఆఫ్రికా ఎడారిలో బిడారిప్రయాణం చేసి తోవలో నువ్వూ, నీ ఊర్వశీ గుడారం వేసుకొని ఉక్కాపీలుస్తూ లొట్టిపిట్టపాల్తో కాఫీ పెట్టుకోవొచ్చు.

ఆవిధంగా చిట్టితో 'ఊహాఊర్వశి' కాపరం చేస్తున్నాను. భావకవుల ఆవేశం నాకు పట్టుకొం దనుకుంటారు కాబోలు. భావకవిత్వంమీద అనాదరణా, కవితలో వాస్తవికత, అతివాస్తవికత అంటే అభిమానం ప్రబలిన తరవాతనే నా యీ మనోజాడ్యం. మనోజాడ్యం కాదు, మనో మనోజ్ఞత.

నాభార్యా మళ్లా గర్భవతి అయింది. ఇట్టే తిరిగొచ్చేయి నవమాసాలూ! కొడుకుట్టేడని అత్తవారు శుభలేఖ పంపారు. బారసాల కెళ్లాను. బారసాల్లూ, సత్యన్నారాయణవ్రతాలూ ఇష్టంలేనివే. అయితేనేం? శుభ్రమైన చాపూ, పెళ్లానికి చీరా, కొడుక్కి బంగారపు వొత్తులూ మామగారు పెట్టేరు. అంచేత పెళ్లాంతో పీటలమీద కూర్చుని అత్తారిని సంతోషపెట్టేను.

నెల కొక్కరోజు తక్కువచేసి, నడ్డి బిగించి పెళ్లాం చంటాడితో టింగురంగా మని వొచ్చింది. కాని చిట్టి కింకా వివాహం కాలేదు. నాకు నలుగురు సంతానం.

చిట్టికి పెళ్లికావడం ఇప్పటికీ నా కిష్టం లేదు. పెళ్లే అయిపోతే జెలసీతో గింజుకు చస్తాను. చాలాకాలం ఎవరిదగ్గరా చిట్టి

అన్న అందాలరాణి పెళ్లి కున్నాదని మాటవరసకైనా చెప్పలేదు. ఎవడైనా పెళ్లాడేస్తాడేమోనని భయం! ఎంతమంది పెళ్లికొడుకులైనా చిట్టిని చూచారు. అందం ఎవడిక్కావాలి? గజిబెడు ఆఫీసరుగారి కూతురు కోతైనాసరే తెనుగుప్రొఫెసర్లు పెళ్లాడతారు. చిట్టి కింకా పెళ్లి కాకపోడం, జీర్ణించిపోయినా, నాలో దురుద్దేశాలని రేపుతున్నాది. చిట్టి కింకా పెళ్లి కాకపోడం తెనుగుయువకుల రసజ్ఞతాదారిద్ర్యం వెల్లడిస్తున్నాది.

చిట్టి కింకా వివాహం కాలేదు. నాకు నలుగురు సంతానం. ఇప్పుడు చిట్టికి ఇరవయ్యొకటో ఏడు నిండిపోయింది. చిట్టి నా పెళ్లాంకన్న మూడేళ్లు పెద్ద.